## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136

RNI NO:APTEL16151

నిరంతర వార్తా ప్రవాహం

# జనసముద్రం న్యూస్

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి:03 | సంచిక:360 | సోమవారం ,ఆగస్ట్ 4 ,2025 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00

# గంటల వ్యవధిలో..

## రాష్ట్రపతితో మోదీ, అమిత్ షా భేటీ

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తో కేంద్ర హోంమంత్రి అమిత్ షా భేటీ అయ్యారు. ఆదివారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. మధ్యాహ్నం సమయంలో ప్రధాని మోదీ కూడా రాష్ట్రపతితో భేటీ అయిన విషయం తెలిసిందే. వీరి వరుస భేటీల వెనక కారణాలు తెలియనప్పటికీ గంటల వ్యవధిలోనే ఇరువురు కీలక నేతలు రాష్ట్రపతితో సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ప్రస్తుతం పార్లమెంటు వర్షాకాల సమావేశాలు కొనసాగుతున్నాయి. జులై 21న మొదలైన సమావేశాలు ఆగస్టు 12 వరకు జరగనున్నాయి. ఇటీవలే ఆపరేషన్ సిందూర్‌పై ఉభయ సభల్లో చర్చ జరిగిన సంగతి తెలిసిందే.



# డబ్బుల కోసం అడ్డదారులు..

## కశ్మీర్‌లో నయా సోషల్ మీడియా దందా!



సామాజిక మాధ్యమాల్లో కొంతమంది కశ్మీరీ యువత అడ్డదారులు తొక్కుతున్నట్లు తెలుస్తోంది. ఫాలోవర్లను పెంచుకునేందుకు, ప్రకటనదారుల నుంచి ఆదాయాన్ని పొందేందుకు.. వేర్పాటువాదులను, ఉగ్రవాదులను పొగడటం వంటి రెచ్చగొట్టే కంటెంట్‌ను పోస్ట్ చేస్తున్నట్లు సమాచారం. భావజాలంతో పని లేకుండా.. కేవలం ఫాలోవర్లు, ఆదాయం కోసమే ఇలా వ్యవహరిస్తున్నట్లు భద్రతా సంస్థలు గుర్తించాయి. ఇటువంటి ఖాతాలను నడిపిస్తున్న కొంతమంది యువకులను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. ఈ వ్యవహారం వెలుగుచూసింది.

కరడుగట్టిన ఉగ్రవాది హిజ్బుల్ కమాండర్ బుర్హాన్ వానీ.. 2016లో భద్రతాబలగాల చేతిలో హతమైన విషయం తెలిసిందే. ఆన్‌లైన్‌లో ఫాలోవర్ల కోసం అటువంటి వ్యక్తుల ఫొటోలను వినియోగించడం వంటి వ్యూహాలు అమలు చేస్తున్నట్లు సంబంధిత యువకులు విచారణలో అంగీకరించినట్లు సమాచారం. ఇలా దేశ, విదేశాల నుంచి అనేక మంది ఫాలోవర్లను సంపాదించిన అనంతరం.. ఆ వ్యక్తుల ఫొటోలను తొలగించి పర్వతాలు, చినార్ చెట్ల వంటి ఇతర ఫొటోలను ఉంచుతున్నట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. కశ్మీర్ లోయలో ఈ కొత్త ధోరణి కలవరపెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పేజి 2లో ▶



## తగ్గిన వరద ప్రవాహం..

### శ్రీశైలంలో 882 అడుగుల నీటిమట్టం

సున్నిపెంట సర్కిల్ : ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద తగ్గుముఖం పట్టింది. దీంతో ఆదివారం అన్ని గేట్లను మూసివేశారు. ఎగువ పరివాహక ప్రాంతాలైన జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 1,18,468 క్యూసెక్కుల వరదనీరు శ్రీశైలానికి వస్తోంది. కుడి ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 65,851 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం జలాశయం నీటిమట్టం 882.10 అడుగులు కాగా, నీటి నిల్వ 199.7354 టీఎంసీలుగా నమోదైంది.

## నీటిగుండంలో మునిగి ఇద్దరు బాలికల మృతి

రాయదుర్గం: అనంతపురం జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. రాయదుర్గం మండలం టి.వీరాపురంలో నీటిగుండంలో మునిగి ఇద్దరు బాలికలు మృతిచెందారు. దోన గంగమ్మ ఆలయం వద్ద ఈ ఘటన జరిగింది. మృతులను శ్వేత (14), మౌనిక (9)గా గుర్తించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# బల్లికురవ గ్రానైట్ క్వారీలో ప్రమాదం..




## ఆరుగురు మృతి

బల్లికురవ సమీపంలోని ఓ గ్రానైట్ క్వారీలో ప్రమాదం చోటు చేసుకుంది. క్వారీ అంచు విరిగిపడి ఆరుగురు వ్యక్తులు మృతి చెందారు. మృతులను ఒడిశా వాసులుగా గుర్తించారు. ప్రమాద సమయంలో క్వారీలో 16 మంది పనిచేస్తున్నట్లు సమాచారం. 2లో..

# బనకచర్లపై

- రాష్ట్ర అభ్యంతరాలపై కేంద్రం పర్యావరణ అనుమతులు నిలిపివేసింది.
- సీడబ్ల్యూసీ, గోదావరి బోర్డు, పోలవరం అథారిటీలు అనుమతులు తిరస్కరించాయి.
- ప్రాజెక్టు రాష్ట్ర విభజన చట్టం, 1980 ఒప్పందాలకు వ్యతిరేకం.
- బీఆర్‌ఎస్ నేతలు బాధ్యతారహిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శ.
- రాష్ట్ర జనాభాలో 84% మందికి సన్న బియ్యం పంపిణీ.
- రేషన్‌కార్డుల సంఖ్య 89 లక్షల నుంచి 98.59 లక్షలకు పెంపు.
- కొత్తగా 8.64 లక్షల కార్డులు జారీ.
- 3.17 కోట్ల మందికి నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ జరుగుతోందని స్పష్టం.

2లో..

## ఎంతవరకైనా పోరాడతాం

### - మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ధర్మారం: ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఎంతవరకైనా పోరాడతామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాల మేరకే బనకచర్ల అనుమతులను సీడబ్ల్యూసీ, గోదావరి నదీ యజమాన్య బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ తిరస్కరించాయన్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ అభ్యంతరాలతో కేంద్రం పర్యావరణ అనుమతులు నిలిపివేసిందన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఉత్తమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

# సంపాదకీయం

## ఫిరాయింపు చిక్కులు

సుప్రీంకోర్టు తీర్పుతో పార్టీ ఫిరాయింపులకు అడ్డుకట్ట పడుతుందా? పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది తెలంగాణ ఎమ్మెల్యేల విషయంలో మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీం తీర్పును శాసనసభ స్పీకర్ ఔదాల్చుతారా? చట్ట సభల స్పీకర్లు ఇకపై సుప్రీంకోర్టు పరిధిలోకి వెళతారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు లభించాలంటే ఏం చేయాలి? జ్యుడీషియరీ, లెజిస్లేచర్ వ్యవస్థలలో ఎవరిది పై చేయి? చట్ట సభల స్పీకర్ల వ్యవహారాలపై తరచూ వివాదాలు ఎందుకు వస్తున్నాయి? ఈ ప్రశ్నలకు సుప్రీంకోర్టు తాజా తీర్పు సమాధానం చెప్పిందా? అంటే అవుననిగానీ, కాదనిగానీ చెప్పలేని పరిస్థితి! పార్టీ ఫిరాయింపు చట్టం లోపభూయిష్టంగా ఉండటంతోపాటు నిర్ణయాలు తీసుకోవడంలో చట్టసభల స్పీకర్లకు నిర్దిష్ట కాలవ్యవధి లేకపోవడమే వివాదాలకు కారణం అవుతోంది. ఒకప్పుడు చట్ట సభల స్పీకర్లు పార్టీలకు అతీతంగా, న్యాయబద్ధంగా నిర్ణయాలు తీసుకొనేవారు. కాలక్రమంలో స్పీకర్లు చట్టసభల్లో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం మొదలుపెట్టారు. దీంతో వివాదాలు న్యాయస్థానాలకు చేరుతున్నాయి. అయితే స్పీకర్ల అధికారాల్లో జోక్యం చేసుకొనే విషయంలో సర్వోన్నత న్యాయస్థానానికి సైతం పరిమితులు ఉన్నందున వివాదాలు వివాదాలుగానే మిగిలిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే భారత రాష్ట్ర సమితికి చెందిన ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు అనర్హత వేటు వేస్తుందని బీఆర్ఎస్ ఆశించింది. అప్పటికే పార్టీ ఫిరాయించిన వారిపై సుప్రీంకోర్టు చర్యలు తీసుకుంటుందని బలంగా చెప్పడం ద్వారా మరికొందరు పార్టీ ఫిరాయించకుండా బీఆర్ఎస్ అడ్డుకోగలిగింది. అయితే సుప్రీంకోర్టు తీర్పు ఆ పార్టీకి ఆశాభంగం కలిగించిందని చెప్పవచ్చు. 'ఆపరేషన్ సక్సెస్%-%పేషెంట్ డెడ్' అన్నట్టుగా తమ తీర్పు ఉండకూడదని భావించిన సుప్రీంకోర్టు... ఫిరాయింపుల విషయంలో నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్‌కు మూడు నెలల గడువు విధించింది. ఈ గడువుకు లోబడి స్పీకర్ నిర్ణయం తీసుకోని పక్షంలో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుంది. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండాలన్నా, చట్టసభలు%-%న్యాయ వ్యవస్థ మధ్య ఘర్షణ తలెత్తరాదన్నా నిర్ణయాలు తీసుకోవడంలో స్పీకర్‌కు పార్లమెంటు గడువు విధించాలని సుప్రీంకోర్టు తన తాజా తీర్పులో పేర్కొంది. స్పీకర్ వద్ద వివాదాలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. ఫలితంగా ఫిరాయింపుల నిరోధక చట్టం అపహాస్యం పాలవుతోంది. ఆ చట్టాన్ని మరింత పకడ్బందీగా సవరించడంతోపాటు స్పీకర్లకు కాలవ్యవధి నిర్ణయిస్తూ పార్లమెంటు చర్యలు తీసుకున్నప్పుడే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అప్పటివరకు జ్యుడీషియరీ, లెజిస్లేచర్‌లలో ఎవరిది పైచేయి అన్న అకడమిక్ చర్చలు సాగుతూనే ఉంటాయి.

**అధికారంలో ఒకలా.. విపక్షంలో మరోలా!**

అధికార పార్టీ ప్రయోజనాలు కాపాడటానికే ఆయా చట్టసభల స్పీకర్లు అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున సకాలంలో నిర్ణయాలు వెలువడటం లేదు. పార్టీ ఫిరాయింపుల విషయమే తీసుకుందాం. అధికారంలో ఉన్నప్పుడు ఫిరాయింపులను ప్రోత్సహించని పార్టీ లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతిపక్షంలోకి వెళ్లాక అవే పార్టీలు అన్యాయం అంటూ ఆక్రోశిస్తుంటాయి. తెలుగు రాష్ట్రాలే ఇందుకు నిదర్శనం. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన కొంత మంది ఎమ్మెల్యేలను నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఇలా చేయడం అనైతికం, అక్రమం అని టీఆర్ఎస్ అధినేతగా ఉన్న కేసీఆర్ ఆక్రోశించారు. ఒక పార్టీ తరఫున గెలిచిన వారిని మరో పార్టీలో ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు? సీన్ కట్ చేస్తే... తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. తాను ఒకప్పుడు తప్పుపట్టిన పనినే ఆయన అధికారంలోకి వచ్చాక దర్జాగా చేశారు. కాంగ్రెస్%-%తెలుగుదేశం %-%కమ్యూనిస్టు పార్టీలకు చెందిన సభ్యులను తమ పార్టీలో కలుపుకొన్నారు. అప్పట్లో శాసనసభలో కేసీఆర్‌కు బొటాబొటి మెజారిటీ మాత్రమే ఉన్నందున ఈ చర్యను ప్రజలు కూడా పెద్దగా ఆక్షేపించలేదు. ఆయన రెండోసారి ముఖ్యమంత్రి అయినప్పుడు సభలో సొంతంగా కావల్సినంత మెజారిటీ ఉండింది. అయినా కాంగ్రెస్, తెలుగుదేశం సభ్యులను చేర్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా లభించకుండా చేశారు. ఇందులోని నైతికతను పక్కనపెడితే కేసీఆర్ చర్యను ప్రజలు కూడా ఆక్షేపించారు. ప్రభుత్వ మనుగడకు ముప్పు లేకపోయినా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమైంది. అప్పట్లో తన చర్యను సమర్థించుకునేందుకు... బంగారు తెలంగాణ సాధనకోసం వారంతా తనతో చేతులు కలిపారని కేసీఆర్ చెప్పుకొన్నారు. 2023లో భారత రాష్ట్ర సమితి అధికారం కోల్పోయింది. గతంలో కేసీఆర్ చేసిన విధంగానే తన ప్రభుత్వ సుస్థిరతకోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఫిరాయింపులను ప్రోత్సహించారు. బీఆర్ఎస్ తరఫున గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో జట్టుకట్టారు. దీంతో బాధితుడిగా మిగిలిన కేసీఆర్, తమ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేయించారు. స్పీకర్ ఎంతకీ నిర్ణయం తీసుకోకపోవడంతో ముందు హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులపై అప్పటి స్పీకర్లు కూడా నిర్ణయాలను పెండింగ్‌లోనే ఉంచారు.

**రాజీనామాలూ 'పెండింగ్'లోనే...**

ఫిరాయింపుల విషయంలోనే కాదు, సభ్యుల రాజీనామాల విషయంలో కూడా స్పీకర్లు నిర్ణయాలు తీసుకోకుండా పెండింగ్‌లో పెడుతున్నారు. రాష్ట్ర విభజనకు ముందు ఉమ్మడి రాష్ట్రంలో స్పీకర్‌గా ఉన్న నాదెండ్ల మనోహర్ సభ్యుల రాజీనామాలను ఆమోదించకుండా కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ తరఫున కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ముఖ్యమంత్రి పదవి తనకు కట్టబెట్టడానికి కాంగ్రెస్ అధిష్ఠానం నిరాకరించడంతో జగన్మోహన్‌రెడ్డి సొంత పార్టీ పెట్టుకున్నారు. కాంగ్రెస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఆయనతో చేతులు కలిపారు. వారితో రాజీనామాలు చేయించి ఉప ఎన్నికలు తీసుకురావడం ద్వారా తన బలం ప్రదర్శించుకోవాలని జగన్‌రెడ్డి తలపోశారు. ఉప ఎన్నికలు వస్తే గెలుపు జగన్‌దే అని తేలిపోవడంతో సదరు రాజీనామాలు ఆమోదం పొందకుండా ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి నాటి స్పీకర్ మనోహర్‌పై ఒత్తిడి తీసుకువచ్చారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో కూడా ఇలాంటి పరిస్థితి పునరావృతం అవుతోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ తరఫున శాసనమండలికి ఎన్నికైన కొందరు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తమ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. సదరు రాజీనామాలు ఆమోదం పొందితే వారి స్థానాలు కూటమికి దక్కుతాయి. కూటమికి శాసనసభలో తిరుగులేని మెజారిటీ ఉన్నప్పటికీ శాసనమండలిలో వైసీపీకే మెజారిటీ ఉంది. చైర్మన్‌గా కూడా ఆ పార్టీకే చెందిన మోషేన్ రాజు ఉన్నారు. దీంతో ఆయన సదరు రాజీనామాలను ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టారు. చట్టసభల ప్రిసైడింగ్ అధికారులు ఈ విధంగా తమ అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారు. 2019లో జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పుడు శాసనమండలిలో తెలుగుదేశం పార్టీకి మెజారిటీ ఉండేది. అప్పుడు బిల్లులు ఆమోదం పొందడంలో జగన్‌రెడ్డి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో శాసనమండలిని రద్దు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి ఎదురుకావడంతో శాసనమండలిని రద్దు చేయించారు. 1983లో ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చినప్పుడు శాసనమండలిలో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ ఉండేది. దివంగత రోశయ్య వంటి హేమాహేమీలు కాంగ్రెస్‌లో ఉండేవారు. వారిని ఎదుర్కోవడం ఎన్టీఆర్‌కు సమస్యగా మారింది. ఆ దశలో 'పెద్దల గలభా' పేరిట ఈనాడు పత్రిక పెట్టిన ఒక శీర్షిక సభా హక్కులను ఉల్లంఘించేదిగా ఉందని కాంగ్రెస్ పార్టీ హక్కుల తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదం పొందింది. 'పెద్ద'లు అని పెట్టిన శీర్షిక తమను అవమానించేదిగా ఉందనేది అభియోగం.హక్కుల తీర్మానానికి ఆమోదం లభించడంతో ఈనాడు పత్రికకు అప్పుడు చీఫ్ ఎడిటర్‌గా ఉన్న రామోజీరావు శాసనమండలికి రావాలని మండలి చైర్మన్ తాఖీదు ఇచ్చారు. దీనిపై రామోజీరావు సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. తమ ఆదేశాలపై స్టే ఇచ్చే అధికారం కోర్టుకు లేదని భావించిన శాసనమండలి రామోజీరావును అరెస్టు చేసి తీసుకురావాలని అప్పటి పోలీస్ కమిషనర్ విజయరామారావును ఆదేశించింది.

## అసహజ మరణాల రికార్డులు డిలీట్:



మొదటిపేజీ తరువాయి

ధర్మస్థలలో దాదాపు 15 ఏళ్లలో చోటుచేసుకొన్న అసహజ మరణాల రికార్డులు మాయం అయ్యాయి. ఈ విషయాన్ని సమాచార హక్కు చట్టం కార్యకర్త ఒకరు వెలుగులోకి తీసుకొచ్చారు. తాను వందకు పైగా యువతులు, మహిళల మృతదేహాలను పూడ్చానని ఓ పారిశుద్ధ్య కార్మికుడి ప్రకటన సంచలనం సృష్టిస్తున్న వేళ ఈ విషయం బయటకు రావడం గమనార్హం. బెళ్తంగడి పోలీసులు 2000-2015 మధ్య అసహజ మరణాల రికార్డును ఓ పద్ధతి ప్రకారం తొలగించినట్లు ఆర్టీఐ కింద చేసిన దరఖాస్తులో వెల్లడైంది. ఈ మేరకు అన్ నేచురల్ డెత్ రిజిస్టర్‌లో ఆ వివరాలు ఉన్నాయని ఓ ఆంగ్లపత్రిక కథనంలో పేర్కొంది. ఇదే సమయంలో పెద్ద సంఖ్యలో అనుమానాస్పద, లెక్కలోకి రాని మరణాలు చోటు చేసుకొన్నట్లు ఆరోపణలున్నాయి.

తాజాగా ఆర్టీఐ కార్యకర్త జయంత్ సిట్ వద్ద ఫిర్యాదు చేశారు. ఓ యువతి మృతదేహాన్ని అక్రమంగా పాతిపెట్టడం తాను చూశానని.. అధికారులు కూడా అక్కడే ఉన్నారని దానిలో పేర్కొన్నారు. దీంతో సిట్ ఫిర్యాదు నమోదు చేసి.. ఆ మృతదేహాన్ని వెలికి తీయాల్సి ఉంది.

పోలీసుల పనితీరు తెలుసుకోవడానికి జయంత్ చాలా కాలం నుంచి ఆర్టీఐని వాడుకొంటున్నారు. ఆచూకీ గల్లంతైన వ్యక్తులు, వారి ఫొటోలను తాను చాలా కాలం క్రితమే బెళ్తంగడి పోలీసులను అడిగినట్లు చెప్పారు. కానీ, తమ వద్ద ఉన్న పత్రాలు, పోస్టుమార్టం రిపోర్టులు, వాల్‌పోస్టర్లు, నోటీసులు, ఫొటోగ్రాఫ్‌లు సాధారణ పరిపాలన పరమైన ఆదేశాల మేరకు నాశనం చేసినట్లు వారు చెప్పారన్నారు. దీంతో ఆగస్టు 2వ తేదీన సిట్ వద్ద ఫిర్యాదు నమోదు చేసినట్లు చెప్పారు. గతంలో ఓ యువతి మృతదేహం పోలీసులకు లభించగా.. దానిని నిబంధనలు ఉల్లంఘించి ఘోరంగా పాతిపెట్టారన్నారు. ఇప్పుడు మృతదేహ అవశేషాలు దొరికినా.. వాటిని ఎవరితో పోలుస్తారని ప్రశ్నించారు. ధర్మస్థలలో తాను వందకు పైగా యువతులు, మహిళల మృతదేహాలను ఖననం చేశానని ప్రకటించిన ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు చూపించిన తొమ్మిది, పదో పాయింట్లలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తవ్వకాలు కొనసాగాయి. తొమ్మిదో ప్రాంతంలోనే తాను ఏడు మృతదేహాలను ఖననం చేశానని చెప్పడంతో కార్మికుల సాయంతో మధ్యాహ్నం వరకు మెల్లగా తవ్వకాలు చేయించారు. అక్కడ ఏమీ కనిపించకపోవడంతో మినీ బుల్డోజర్‌తో పనులు చేయించారు. అక్కడా ఏమీ లభించకపోవడంతో, పదో ప్రాంతానికి వెళ్లి తవ్వకాలు కొనసాగించారు.

## బనకచర్లపై ఎంతవరకైనా పోరాడతాం

మొదటిపేజీ తరువాయి

ఇటీవల దిల్లీలో జరిగిన రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో బనకచర్లపై తమ వాదనలు గట్టిగా వినిపించామని మంత్రి చెప్పారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర విభజన చట్టం, 1980-గోదావరి నదీజలాల పంపిణీ ఒప్పందాలకు వ్యతిరేకంగా ఉందన్నారు. ఇవన్నీ తెలిసిన భారత రాష్ట్ర సమితి నేతలు బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని ఉత్తమ్ విమర్శించారు.రాష్ట్ర జనాభాలో 84 శాతం మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 89 లక్షల రేషన్‌కార్డులు ఉండగా.. తమ ప్రభుత్వం వచ్చాక ఆ సంఖ్య 98.59లక్షలకు చేరిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా 8.64లక్షల కొత్త కార్డులు జారీ చేసిందని తెలిపారు. గతంలో 2.81కోట్ల మందికి నాసిరకమైన దొడ్డు బియ్యం పంపిణీ చేశారని.. ఇప్పుడు 3.17కోట్ల మందికి నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నామని మంత్రి వివరించారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన దొడ్డు బియ్యం ఎవరూ తినడం లేదనే ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు.

## లోపాలను సరిదిద్దుకుని పార్టీని ముందుకు నడపాలి: మంత్రి సీతక్క

మొదటిపేజీ తరువాయి



నిజామాబాద్: కాంగ్రెస్ పార్టీలో గ్రూపులను పక్కనపెట్టి అందర్నీ నేతలు ఐక్యంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి సీతక్క సూచించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన జనహిత పాదయాత్ర నిజామాబాద్ జిల్లాలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ రాష్ట్రవ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు. " నాయకులు లోపాలను సరిదిద్దుకుని పార్టీని ముందుకు నడపాలి. మనకు నచ్చిన వారిని కాదు.. సమాజానికి నచ్చిన నాయకుడిని ముందుకు తీసుకెళ్లాలి. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి. గ్రామస్థాయి నుంచి నాయకులను తయారు చేయాలి. ప్రజల కోసం, సమాజాభివృద్ధి కోసమే పనిచేయాలి. ఎన్నికల వచ్చినప్పుడు భాజపా విభజన రాజకీయాలు చేస్తోంది" అని సీతక్క అన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అంత ఈజీగా తీసుకోవద్దు: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి



హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అంత ఈజీగా తీసుకోవద్దని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు. " మాగంటి గోపీనాథ్ అకాల మరణం చాలా బాధాకరం. అనుకోకుండా వచ్చిన ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలి. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో క్లాస్, మాస్ అందరూ ఉంటారు. హైదరాబాద్‌లో లక్ష మంది పేదలకు జీవో 58, 59 కింద పట్టాలు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం.

అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేదు. పేద వారికి మాత్రమే హైడ్రా నిబంధనలు వర్తిస్తాయా? సన్న బియ్యంతో విద్యార్థులకు అన్నం పెట్టింది.. కేసీఆర్ ప్రభుత్వమే. తెలంగాణలో మతం పేరుతో కేసీఆర్ రాజకీయం చేయలేదు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో ఒక్క మంచి పని కూడా చేయలేదు. నూరు రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ప్రజలను మోసం చేశారు" అని కేటీఆర్ విమర్శించారు.

# బల్లికురవ గ్రానైట్ క్వారీలో ప్రమాదం..

మొదటిపేజీ తరువాయి

బాపట్ల: జిల్లాలోని బల్లికురవ సమీపంలోని ఓ గ్రానైట్ క్వారీలో ప్రమాదం చోటు చేసుకుంది. క్వారీ అంచు విరిగిపడి ఆరుగురు వ్యక్తులు మృతిచెందారు. మృతులను ఒడిశా వాసులుగా గుర్తించారు. ప్రమాద సమయంలో క్వారీలో 16మంది పనిచేస్తున్నట్లు సమాచారం. వెంటనే అప్రమత్తమైన అధికారులు క్వారీలో సహాయక చర్యలు చేపట్టారు.

బల్లికురవ సమీపంలోని గ్రానైట్ క్వారీల్లో ప్రమాదాలు జరగటం సర్వసాధారణం అయిపోయింది. క్వారీల్లో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్న అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఈ క్వారీ ప్రమాదాలపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**ఈ ఘటనపై విచారణ జరపాలి: సీఎం చంద్రబాబు**

బల్లికురవ క్వారీ ప్రమాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. బాపట్ల జిల్లా బల్లికురవ క్వారీలో జరిగిన ప్రమాదంలో నలుగురు మృతి చెందడంతో పాటు మరి కొంత మంది కార్మికులు తీవ్రంగా గాయపడిన ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. క్వారీలో పనులు చేస్తున్న కార్మికులపై రాళ్లు పడటంతో ఆరుగురు కార్మికులు మృతి చెందారని అన్నారు. ప్రమాదంలో ఇంతమంది ప్రాణాలు కోల్పోవడంపై సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై అధికారులతో సీఎం మాట్లాడారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, ఈ ఘటనపై విచారణ జరపాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

**ఈ ఘటన తీవ్రంగా కలచివేసింది: మంత్రి నారా లోకేష్**

బాపట్ల జిల్లా బల్లికురవ సమీపంలోని ఓ గ్రానైట్ క్వారీలో బండరాళ్లు పడి ఆరుగురు కార్మికులు దుర్మరణం పాలవడం తనను తీవ్రంగా కలచివేసిందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ప్రమాదంలో రోజువారీ కూలీలు మృతిచెందడం బాధాకరమని అన్నారు. గాయపడిన వారికి అవసరమైన వైద్యసాయం అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని మంత్రి నారా లోకేష్ తెలియజేశారు.

**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి: మంత్రి కొలుసు పార్థసారథి**

బల్లికురవ క్వారీ ప్రమాదంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్ ద్వారా మాట్లాడారు. రెస్క్యూ చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. బాధిత కుటుంబాలను ఏపీ ప్రభుత్వం పూర్తిగా ఆదుకుంటుందని మంత్రి పార్థసారథి హామీ ఇచ్చారు. ఈ దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలంటూ కలెక్టర్‌కు సూచించామని అన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరించారు.

**క్వారీ ప్రమాదంపై మంత్రుల దిగ్భ్రాంతి**

బాపట్ల జిల్లాలో గ్రానైట్ క్వారీ ప్రమాదంపై మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బల్లికురవ సమీపంలోని ఓ గ్రానైట్ క్వారీలో రాయిపడి ఆరుగురు కార్మికులు మృతి చెందడంపై మంత్రులు సత్యప్రసాద్, గొట్టిపాటి రవి కుమార్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు మంత్రులు సానుభూతి తెలిపారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.

**బాధ్యులపై కఠిన చర్యలు: మంత్రి కొల్లు రవీంద్ర..**

బల్లికురవ క్వారీ ప్రమాదంపై మంత్రి కొల్లు రవీంద్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనలో ఆరుగురు కార్మికులు మృతి చెందడం బాధాకరమని ఆవేదన చెందారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి, ప్రమాదంపై తక్షణమే విచారణ జరిపించాలని అధికారులకు ఆదేశించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన చిరంజీవి

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సినీ నటుడు చిరంజీవి కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసానికి వెళ్లి ఆయనతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దీనికి సంబంధించిన వీడియోను సీఎంవో 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది.



# భూ కబ్జాదారుల ఆగడాలను భరించలేక ఈ నెలతహసిల్దార్ ఆఫీస్ వద్ద యూసుఫ్ ఖాన్ అనే 93 ఏళ్ల కురు వృద్ధుడు ధర్నాకు సిద్ధం

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ ఆగస్టు 4**

మహబూబాబాద్ పట్టణ పరిధిలో తమ భూమిని ఆక్రమించుకొని ఇబ్బందులకు గురిచేస్తున్న భూ కబ్జాదారుల ఆగడాలను భరించలేక ఈ నెల 12వ తేదీన స్థానిక తహసిల్దార్ ఆఫీస్ వద్ద యూసుఫ్ ఖాన్ అనే 93 ఏళ్ల కురు వృద్ధుడు ధర్నాకు సిద్ధమవుతున్నారు.ఈ విషయమై ఈరోజు మహబూబాబాద్ లో పట్టణానికి చెందిన ముస్లింలు స్థానిక ఈద్గాలో పత్రిక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో యూసుఫ్ ఖాన్ కుటుంబ సభ్యులతో పాటు వివిధ పార్టీలకు చెందిన, వివిధ కమిటీలకు చెందిన,ముస్లింలు ఈ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా యూసుఫ్ ఖాన్ కుమారుడైన అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ, జులై నెల 12వ తేదీన మండల సర్వేయర్ సర్వే ప్రకారం మా హద్దులకు మేము రాళ్లు పాతుకోగా కబ్జాదారులు తొలగించడం జరిగింది. ఈ విషయమై టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన కూడా పోలీసులు నిర్లక్ష్యంతో ఉన్నారు. పోలీసుల నిర్లక్ష్యంతో మరింతగా పోయిన కబ్జాదారులు ఆ భూమిలోకి వస్తే మిమ్మల్ని చంపేస్తామని,



భూమిలోకి రానివ్వడం లేదని వారి ఆగడాలకు విసిగిపోయిన తన తండ్రి 93 ఏళ్ల యూసుఫ్ అలీ ఖాన్ ఈ నెల 12వ తేదీన స్థానిక తహసిల్దార్ ఆఫీస్ ముందు ధర్నాకు సిద్ధమవుతున్నారని అన్నారు. కంకర్ బోడు మసీద్ కు చెందిన మసీద్ ప్రెసిడెంట్ మహమ్మద్ అదిల్ మాట్లాడుతూ– ముస్లింలపై దౌర్జన్యాలు చేయడం మంచి పద్ధతి కాదని,ఇప్పటికైనా భూకబ్జా దారులుతమ వైఖరి మార్చుకోవాలని, ఇది ఒక కుటుంబ సమస్య కాదని, మహబూబాబాద్ లోని ప్రతి ముస్లిం సమస్య అని ఈ సమస్యను కలిసికట్టుగా ఎదుర్కొంటామని అన్నారు. ఇస్లేహా మాషిర కమిటీ మహబూబాబాద్ అధ్యక్షులు ఎండి ఇక్బాల్ మాట్లాడుతూ– చాలా తేలికగా పరిష్కారం అయ్యే సమస్యను భూకబ్జాదారులు జటిలం చేసుకుంటున్నారని, యూసుఫ్ ఖాన్ కుటుంబం ఎలా సర్వే చేసుకున్నారో, పక్క వారు కూడా తమ తమ భూములకు సర్వే నిర్వహించుకోవడం ద్వారా సమస్య పరిష్కారం అవుతుందని ,మహబూబాబాద్ కు చెందిన రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు, స్థానిక ఎమ్మెల్యే గారు చోరవ తీసుకొని పక్క వారి భూమి కూడా సర్వే చేయడం వల్ల ఈ సమస్య అతి తేలికగా పరిష్కారం అవుతుందని, సంబంధిత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ఈ విషయమై సానుకూలంగా స్పందించి సమస్యను త్వరగా పరిష్కారం చేయాలని, ఈ నెల 12వ తేదీ నాడు యూసుఫ్ అలీఖాన్ ధర్నా చేయకముందే సమస్య పరిష్కారమైతే అందరికీ బాగుంటుందని, 93 ఏళ్ల కురు వృద్ధుడు తన హక్కుల కోసం ధర్నా చేయడం ముస్లిం సమాజానికి, ప్రభుత్వానికి మంచిది కాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్ నాయక్, సయ్యద్ సాదిక్, నిజాం, మక్బూల్, నజీర్, అబ్దుల్ కలీం, యాఖుబ్ పాషా, ముజాఫర్, జియా, ఇంతియాజ్ ఖాన్, మహమ్మద్ అలీఖాన్, అలీమ్, ఫజల్, అన్వర్, ఫెరోజ్, అజీజ్, అజీమ్, సఫర్ తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ తెలబోయిన లక్ష్మయ్య మరణం పార్టీకి తీరని లోటు సంతాప సభలో వక్తల పిలుపు

- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ ఆగస్టు 4**

మహబూబాబాద్ డివిజన్ కమిటీ సభ్యుడు పట్టణ కమిటీ కార్యదర్శి తెలబోయిన లక్ష్మయ్య మరణం విప్లవోద్యమాని కి తీరని లోటు వారి మృతి పట్ల వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలియ జేస్తున్నామని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మండల వెంకన్న సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గౌని ఐలయ్య లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు మహబూబాబాద్ పట్టణంలోని ఎస్ ఎస్ వి ఎల్ ఫంక్షన్ హాల్ లో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కామ్రేడ్ హలవత్ లింగన్న అధ్యక్షతన కామ్రేడ్ తెల బోయిన లక్ష్మయ్య సంతాప సభను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కామ్రేడ్ మండల వెంకన్న గౌని ఐలయ్యలు మాట్లాడుతూ కామ్రేడ్ లక్ష్మయ్య విద్యార్థి దశలో పి డి ఎస్ యు ఉద్యమంలో క్రియా శీలకమైనటువంటి పాత్రను పోషించాడు తను విప్లవోద్యమానికి కేంద్రమైన బయ్యారం మండలం కారుకొండ గ్రామంలో జన్మించారు ఆ ప్రాంతంలో చిన్నతనం నుండే పార్టీలో క్రియాశీలకమైనటువంటి పాత్రను పోషిస్తూ అనేక దాడులను ఎదుర్కొన్నాడు కామ్రేడ్ లక్ష్మి అను హతమార్చాలని చేపూరి రవి మూట తీవ్రమైన ప్రయత్నాలు చేసినప్పటికీ వాటన్నిటిని తట్టుకొని దృఢంగా పార్టీ వైపు నిలబడ్డాడు. 2002లో మహబూబాబాద్ పట్టణంలో నివాసం



ఏర్పాటు చేసుకున్నాడు నాటి నుండి నేటి వరకు మహబూబాబాద్ పట్టణంలో ప్రజా ఉద్యమంలో, కార్మిక ఉద్యమంలో, పేదల ఇండ్ల స్థలాల కోసం కాలనీ లా నిర్మాణం కోసం ,తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించాడు మహబూబాబాద్ పట్టణంలో పార్టీ విస్తీర్ణ కోసం ముఖ్యపాత్రను పోషించాడు ఈ ప్రాంతంలో కార్యకర్తలకు పార్టీ శ్రేణులకు సుపరిచితుడు గా ఉంటూ ప్రజల దైనందిన సమస్యలలో పరిష్కారంలో భాగస్వామిగా మారాడు. తాను లేని లోటును తీర్చలేనిది లేనిది కామ్రేడ్ లక్ష్మయ్య మరణం ప్రతి కార్యకర్తను కలిచివేసింది తన ఆశయాన్ని కొనసాగించడానికి ప్రతి ఒక్క కార్యకర్త బాధ్యతగా పని చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని అదే ఆయన కిచ్చే నిజమైన నివాలన్నీ వారు పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సాదుల శ్రీనివాస్ సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ నల్ల సుధాకర్ రెడ్డి సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ కొత్తపల్లి రవి లు మాట్లాడుతూ కామ్రేడ్ లక్ష్మయ్య మృదు స్వభావి ఆయన మరణం తన కుటుంబానికే కాక పేద ప్రజలకు తీరని లోటని నేడు దేశంలో మతోన్మాద శక్తులు



కొనసాగిస్తున్న ప్రజా వ్యతిరేక ఉద్యమంలో తను లేని లోటు తీర్చ లేనిద ని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సభలో అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ బండారి ఐలయ్య భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్టియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కామ్రేడ్ పర్వత కోటేష్ కామ్రేడ్ శివారపు శ్రీధర్ బిఎస్పి జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ దార్ల శివరాజ్ ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి చమ్మయ్య భగత్ సింగ్ స్టడీ సర్కిల్ బాధ్యులు గోవర్ధన్ సార్ టిపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మెంబర్ శ్రీశైలం ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు గూగులోత్ సక్రు మైల యాకయ్య అఖిల భారత రైతు సంఘం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గుజ్జు దేవేందర్ పి వై ఎల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సామ పాపయ్య బట్టు చైతన్య ఎండి జబ్బర్ ఎస్ కే బాబు తిరుపతమ్మ ఉకే పద్మ గుజ్జు కృష్ణవేణి సామ రజిత తెలబోయిన కృష్ణ దొడ్డ రాజు చేపూరి సురేష్ తదితరులతోపాటు 300 మంది పార్టీ శ్రేణులు బంధువులు పాల్గొన్నారు

# ఆగస్టు 4 చలో కలెక్టరేట్ ముట్టడి జయప్రదం చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

- జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ వందలాదిగా కదలిరండి

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ ఆగస్టు 4**

మహబూబాబాద్ పట్టణ పరిధిలో ఓసి క్లబ్ ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో రేపు ఆగస్టు 4న సోమవారం రోజు చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం జయప్రదానికై సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో నేడు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది పట్టణ ప్రధాన వీధుల గుండా పలు కాలనీలలో సెంటర్లలో ప్రచారం నిర్వహిస్తూ బైక్ ర్యాలీ కొనసాగించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఓసి క్లబ్ ను స్వాధీనం చేసుకోవాలని దశలవారీగా ఉద్యమాలు నిర్వహిస్తున్నామని రేపు చలో కలెక్టరేట్ ముట్టడి



కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు వందలాదిగా పాల్గొని కలెక్టరేట్ ను ముట్టడించాలన్నారు ఓసీ క్లబ్ ను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బహుళ ప్రయోజనాల కోసం ఉపయోగించాలన్నారు గత పదివేల టిఆర్ఎస్ పాలనలో నాడు అధికార ప్రజాప్రతినిధులు కబ్జా చేయాలని చూస్తే ఆధారాలతో సహా నాడు సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి బయట పెట్టాడన్నారు ఈ సందర్భంగా రేపు జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునివ్వడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్ చింతకుంట్ల వెంకన్న పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్ జలగం ప్రవీణ్ మంద శంకర్ నాంచారి దాసు సిలువేరు వికాస్ రాగ మల్లయ్య బేతమల్ల శ్రీనివాస్ తోట రమేష్ బల్లెం శ్రీకాంత్ జడల నటరాజ్ మేక వెంకటేష్ మంద శ్రీనివాస్ వంగూరి నాగేంద్రబాబు కన్నె రాజు రాజేందర్ బోళ్ల భద్రయ్య నాగరాజు రవి షరీఫ్ గుండోజు రమేష్ నజీర్ దూర ఉపేందర్

# నిరుపేదలకు అండగా సానిక్షా ఫౌండేషన్ సేవలు

**జన సముద్రం న్యూస్ చిన్న శంకరంపేట మండలం మెదక్ జిల్లా ఆగస్ట్ 3**



చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లికి చెందిన ముంద్రాతి లక్ష్మి పక్షవాతం వ్యాధితో బాధపడుతుంది. ఒకరి సహాయం లేనిదే నడవలేని పరిస్థితిలో ఉన్నది. విషయం తెలుసుకున్న సానిక్షా ఫౌండేషన్ చైర్మన్ డా.శివ, వీ కెన్ మేక్ ఏ చేంజ్ టీం అధ్యక్షుడు భార్గవ్ ఆర్యన్ సహకారంతో ఆదివారం వీల్ చేరుని అందించారు. భవిష్యత్తులో అన్ని విధాల ఆదుకుంటామని వారికి భరోసాని కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్, పృథ్వీరాజ్, సురేష్ గౌడ్, నర్సింలు, సిద్దు, సత్యం, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# దిక్కు తోచని పరిస్థితి లొ పడిపోయాను దయచేసి ఎవరైనా దాతలు సహాయం చేయండి

**జనసముద్రం న్యూస్ చిన్న శంకరంపేట మండలం మెదక్ జిల్లా ఆగస్ట్ 3**





నాపేరు బానోత్ రమేష్ ఖాజాపూర్ తండా, చిన్న శంకరంపేట్ మండలం, మెదక్ జిల్లా, నేను రోజు వ్యవసాయం పనులతో పాటు రోజు వారి కూలి చేస్తూ నా కుటుంబాన్ని పోషిస్తున్నాను, నాకు గత ఎనిమిది నెలల క్రితం వివాహం అయింది. నా భార్య ప్రస్తుతం నాలుగు నెలల గర్భిణీ గురువారం రోజున వ్యవసాయా పొలంలొ మందుల కోసం నా స్నేహితులతో కలిసీ మెదక్ వెళ్తుండంగా అనుకోకుండా ఆక్సిడెంట్ అయి మెడినోవా హాస్పిటల్ మేడ్చల్ లొ అడ్మిట్ అయ్యాను. రెండు రోజుల క్రితం నా కాళ్లు పూర్తిగా పనిచేయకపోవడం తొ అత్యవసరం గా ఆపరేషన్ చేసి పూర్తిగా తీసేశారు.ఆసుపత్రి ఖర్చులు 3 లక్షల వరకు ఖర్చు అవుతుంది. నా ఖర్చులు భరించలేని స్థితిలో నా కుటుంబం వుంది కావున దయచేసి నన్ను ఆదుకోండి నా తల్లి తండ్రులు కూడా నిరుపేద రైతులు. ఎవరైనా దాతలు తప్పకుండ నన్ను ఆదుకొని కాపాడుతారని ఆశిస్తున్నాను. పూర్తి వివరాలకు ?o918008893292?, ?o919705747102? ఇ నెంబర్ కు కాల్ చేయండి మీకు జీవితాంతం రుణపడి వుంటాను.

# ఆత్మీయ సన్మానం భూరం సంజీవ్, మహ్మద్ అజీమ్ ఆగ సురేష్

**కోరుట్ల నియోజకవర్గం,(ఆగస్టు.3)(జనసముద్రం న్యూస్ ):**



మెట్పల్లి పట్టణంలోని కొత్త బస్టాండ్ ముందు గౌరమ్మ వంటిల్లు రెస్టారెంట్ %ఽ% మెస్ ఓపెనింగ్ సందర్భంగా టి యు డబ్ల్యు జే (ఐజేయూ) ప్రింట్ మీడియా మెట్ పల్లి అధ్యక్షుడు భూరం సంజీవ్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ అజీమ్ ఆగ సురేష్ లను రెస్టారెంట్ ఓనర్ రాంపల్లి నాగేశ్వర్ ఘనంగా సన్మానించారు.

# అక్రమ లేఅవుట్లకు అడ్డ పెద్ద బొంకూర్

- అడ్డుకునే అధికారులు ఎవరు?
- పుట్టగొడుగుల్లా పెరుగుతున్న అక్రమ లేఔట్లు
- ఎకరాకి కోట్లల్లో అమ్మకాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- చోద్యం చూస్తున్న అధికారులు



**జనసముద్రం న్యూస్ : ఆగస్టు 4 ( పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్ )**



పెద్దపల్లి మండలంలోని పెద్ద బొంకూర్ గ్రామ పంచాయతీ పరిధిలో విచ్చలవిడిగా అక్రమ లేఔట్లు వెలుస్తున్నాయి. ఇట్టి అక్రమ లేఔట్లకు ఎలాంటి సంబంధిత శాఖ ప్రభుత్వం అనుమతులు లేవని వ్యవసాయ భూములను కొనుగోలు నాలా కన్వర్షన్ చేసి ప్లాటుగా భూములను అమ్ముతున్నారని గ్రామ ప్రజల నుండి ఆరోపణలు వస్తున్నాయి. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి 1 కిలోమీటర్ దూరంలో గల పెద్దబొంకూర్ పెద్దపల్లి నుండి కరీంనగర్ వెళ్లే ప్రధాన రాజీవ్ రహదారికి పక్కన ఉన్న గ్రామం కావడంతో విచ్చలవిడిగా అక్రమ లేఔట్లు ఏర్పడుతున్నప్పటికీ అక్రమ లేఅవుట్ దారులపై , పంచాయతీ కార్యదర్శి కేవలం నోటీసులకే పరిమితం చేస్తున్నారు. అమ్మకాలు కొనుగోలు లక్షల్లో, కోట్లల్లో

**లేఅవుట్ అనుమతుల ఆదాయం జీరో ?**

పెద్దబొంకూర్ గ్రామంలో చాలా వరకు ఏర్పడిన అక్రమ లేఅవుట్లలో ఇదే పరిస్థితి ఎలా అనగా జంగ శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి 6 ఎకరాలలో అక్రమ లేఔట్ ఏర్పాటు చేస్తే అట్టి అక్రమ లేఔట్ లో ఖని రాళ్లను (ప్లాట్లుగా ఏర్పాటు చేసిన రాళ్లను ) తొలగించకుండా కేవలం నోటీసులు మాత్రమే ఇస్తున్నారని చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదని తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని పెద్దబొంకూర్ గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న అక్రమ లేఅవుట్ లలో 1 గుంట స్థలానికి 10 నుంచి 30 లక్షల లోపు ఉంటుందని , 1 ఎకరాకి 1 కోటి 50 లక్షలు నుంచి 4 కోట్ల వరకు ఉంటుందని ఈ అక్రమ లేఅవుట్ దారుల నుండి భూములు అమ్మకాలు కొనుగోలు జరగడం ద్వారా ఇండ్ల స్థలాలకు భూమి కొనుగోలు చేసిన వాళ్లకు గ్రామ పంచాయతీ అనుమతులు రావడం లేదని ఇల్లు కట్టుకోవడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే పైళ్ల

**యాదాద్రి భువనగిరి జిల్లా (ఆగస్టు.04) జనసముద్రం న్యూస్**



బీబీనగర్ మండల పరిధిలోని నెమరగోముల గ్రామానికి చెందిన బీబీనగర్ పిఎసిఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి సోదరుడు ఉమ్మడి నల్లగొండ జిల్లా స్టోన్స్ అండ్ క్రషర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మెట్టు మోహన్ రెడ్డి – సౌజన్య దంపతుల కుమార్తె ఆకాంక్ష – అభిషేక్ రెడ్డి ల వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి.వారితో పాటు బీబీనగర్ మాజీ ఎంపీపీ యర్కల సుధాకర్ గౌడ్,మాజీ ఎంపీటీసీలు యర్కల బాలకృష్ణ గౌడ్,తూర్పునూరి రాజశేఖర్ గౌడ్,మాజీ సర్పంచ్ ధరావత్ వెంకటేష్ నాయక్,నాయకులు రాజు నాయక్,హరిచంద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

